నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం 26 జనవరి 2023

ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం బోధన్ మండల విద్యాధికారి కార్యాలయంలో సీఆర్పీలు ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించారు. పదోన్నతులు కోరుతున్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.


దరఖాస్తులు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మాస్టర్‌ప్లాన్‌పై విచారణ ఫిబ్రవరి 22కు వాయిదా

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై హైకోర్టు విచారణ ఫిబ్రవరి 22 వరకు వాయిదా వేసింది. బుధవారం హైకోర్టులో మాస్టర్ ప్లాన్ పై విచారణ జరిగింది. ఈ సందర్భంగా పిటిషనరీతరపు న్యాయవాది నూతన మాస్టర్ ప్లాన్ ను మున్సిపల్ కౌన్సిల్ రద్దు నట్టు తీర్మానం చేసిందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అయితే కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. టౌన్ ప్లానింగ్ 14ఆక్ట్ ప్రకారం మాస్టర్ రద్దు పై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. దీంతో కౌన్సిల్ తీర్మానంపై రెండు వారాల్లో ప్రభుత్వ వైఖరి తెలిపాలని హైకోర్టు ఆదేశించింది.

గణతంత్ర వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబు

- ఈసారి కొత్త కలెక్టరేట్‌లో ఏర్పాట్లు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గణతంత్ర దినోత్సవ వేడుకలకు నిజామాబాద్ నూతన కలెక్టరేట్ సిద్ధమైంది. ప్రతిసారీ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తుండగా.. కొత్త కలెక్టరేట్ ప్రారంభమైన నేపథ్యంలో ఈసారి కలెక్టరేట్‌లోనే నిర్వహించనున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం పరిశీలించారు. ఉదయం 10.00 గంటలకు కలెక్టర్ జెండాను ఆవిష్కరించనుండగా.. ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొనున్నారు. సమీకృత కార్యాలయాల సముదాయం అందుబాటులోకి వచ్చిన అనంతరం తొలిసారిగా జాతీయ పండుగను నిర్వహించనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా సమీకృత కార్యాలయాల సముదాయం ఆవరణను అందంగా ముస్తాబు చేశారు. వేదికను రంగురంగుల పూలతో అందంగా అలంకరించి, ఆహుతుల కోసం షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనర్ కేఆర్. నాగరాజు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీఓ. రవి, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించేలా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీస్ పరేడ్ తదితర కార్యక్రమాల గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ ఇదివరకే సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు.


గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబైన నిజామాబాద్ నూతన కలెక్టరేట్


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రాక్టీస్ కోసం వచ్చిన విద్యార్థులు

మూడు భాషల్లో ముచ్చటగా..

- సుద్ధ ముక్కలతో జాతీయగీతం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రానికి చెందిన పత్తి వార్ మధుకర్ అనే యువకుడు జాతీయ గీతాన్ని తెలుగు, ఇంగ్లీష్, మరాఠీ మూడు భాషల్లో సుద్ధ ముక్కలతో చెక్కి తన ప్రతిభ చాటుకున్నాడు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సుద్ధముక్కలనే అక్షరాలుగా మలిచి మూడు భాషల్లో ఏర్పాటు చేసి ఔరా అనిపించాడు. అతడి ప్రతిభకు మండల వాసులు అభినందనలు తెలియజేస్తున్నారు.



తెలుగు, ఇంగ్లీష్, మరాఠా భాషల్లో సుద్ధముక్కలు చెక్కి.



అప్పడంపైన జనగణమన, అంబేద్కర్ చిత్రం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రానికి చెందిన కర్రీవార్ పండరి అనే యువకుడు 73వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని అప్పడంపైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటంతో పాటు జాతీయ గీతాన్ని గీసి అబ్బురపరిచాడు. జాతీయ పండుగలు వేళ తన ప్రతిభను ఒక్కో విధంగా వెలికితీస్తున్నారని, మున్ముందు మరింతగా రాణించాలని మండల వాసులు ఆకాంక్షిస్తున్నారు.





టీచర్‌లకు సెలవులు ఇవ్వరాదనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

- టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్/భీంగల్

ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వరాదని ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి సత్యానంద్, ఓ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయొద్దని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఉత్తర్వులు ఇవ్వడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) నిజామాబాద్ జిల్లా పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సెలవులు అనేవి ఉపాధ్యాయుల ప్రాథమిక హక్కు దానిని బదిలీలు, ప్రమోషన్ల పేరుతో ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వరాదనడం సరికాదని తెలిపారు. బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమాచారం పై అధికారులకు డిడిఓ లు లేదా ఎం ఈ ఓ లు చేరవేస్తారని అలాంటప్పుడు ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడం సమంజసంగా లేవని, వ్యక్తిగత అవసరాలు, కుటుంబ అవసరాలు, ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్న సందర్భంలో వాడుకోవాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. కాబట్టి డీఈవో నిజామాబాద్ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనా కార్యక్రమలకు సిద్ధపడతామని హెచ్చరించారు.

భీంగల్ : ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయొద్దని జిల్లా విద్యాశాఖ అధికారి ఇవ్వడాన్ని ఖండిస్తున్నట్టు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్ధన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన మంచిప్ప భూ నిర్వాసితులు

నవతెలంగాణ-మోపాల్

పాత డిజైన్ ప్రకారమే పనులు చేపట్టాలని పోరాడుతున్న తమపై పాలకులు అక్రమంగా మర్డర్ కేసులు బనాయించి జైలుకు తరలిస్తున్నారని మంచిప్ప భూ నిర్వాసితులు బుధవారం పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని హైదరాబా ద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈస ందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ భూ నిర్వాసితులపై పెట్టిన కేసుల విషయంలో ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తానని హామీ ఇచ్చారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడతామన హామీ ఇచ్చారు. రైతుల పోరాటాలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ముందుంటదని చెప్పారు.


రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

స్టూడెంట్ ఇంటర్ షిప్ ప్రోగ్రామ్‌కు భిక్కనూర్ విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-భిక్కనూర్

దేశవ్యాప్తంగా జరిగిన నీతి అయోగ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్ నిర్వహించిన అటల్ మార్షల్-2022లో 30 ఉత్తమ బాలిక టీంలలో ఒకటిగా నిలిచి స్టూడెంట్ ఇంటర్ షిప్ పోగ్రామ్‌కు భిక్కనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న వైష్ణవి, మీనాక్షి, రిషిక ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్ బుధవారం తెలిపారు. వీరికి ఐదు రోజులు వర్చువల్‌గా, మిగతా ఐదు రోజులు డెల్ టెక్నాలజీస్ బెంగుళూరు నందు ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారని తెలిపారు. నేటి బాలికలు ప్రపంచంలో ఏ విధంగా పోటీపడి ఉత్తమ వ్యవస్థాపకులుగా తయారు కావచ్చునో, వారి శక్తి సామర్థ్యాలు వ్యవస్థకు ఏ విధంగా ఉపయోగపడతాయో ప్రాజెక్టు మేనేజర్స్ డెల్ టెక్నాలజీస్ వారు సవివరంగా వివరించినట్లు విద్యార్థులు తెలిపారు. డెల్ టెక్నాలజీస్ బెంగుళూరు నందు తమ ప్రాజెక్టు అయిన స్కూల్ హెల్త్ సర్వీస్ యాప్‌ను ప్రదర్శించారని, విద్యార్థులు తమ ఆప్ డాటాను క్లౌడ్ లో ఉంచడానికి, అందరూ ఈ యాప్ ను ఉపయోగించుకునేలా సాఫ్ట్ వేర్ మెరుగుపరచడానికి తాము ప్రోత్సహం అందిస్తామని డెల్ టెక్నాలజీస్ వారు హామీ ఇచ్చారని గైడ్ టీచర్ బాలగంగాధర్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు తెలియజేశారు. స్టూడెంట్ ఇంటర్ప్ ప్రోగ్రాం కు విద్యార్థులు ఎంపిక ఇవ్వడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేసి, ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాన్ని వెలికి తీసి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

లోక్ అదాలత్‌లతో సమస్యలకు సత్వర పరిష్కారం

- జిల్లా జడ్జ్ శ్రీదేవి

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

లోక్ అదాలత్ ద్వారా ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కామారెడ్డి జిల్లా జడ్జి శ్రీదేవి అన్నారు. కామారెడ్డి పట్టణంలోని కోర్టులో బుధవారం జాతీయ లోక్ అదాలత్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సంవత్సరాల తరబడి వివాదంలో ఉన్న రెవెన్యూ , కుటుంబ సమస్యలకు లోక్ అదాలత్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, న్యాయవాదులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్ పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి, కలెక్టర్ తదితరులు..


కంటివెలుగు శిబిరం ప్రారంభించి అద్దాలు అందజేత

కోర్టు భవనంలో కంటి వెలుగు

కామారెడ్డి ఫాక్సో కోర్టు భవనంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. న్యాయవాదులు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి శ్రీదేవికి కళ్లద్దాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు.

తడి, పొడి విధానంతో దిగుబడి

- జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి


వరిలో తడి, పొడి సాగు విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్/రామారెడ్డి

సాగులో మెళకువలు పాటించి, నూతన పద్ధతులు అవలంభిస్తే పంటలకు అధిక దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని కాచాపూర్ గ్రామంలో కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ హైదరాబాదు వారి సహకారంతో పద్మపాని స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణ లో నిర్వహించిన సమావేశంలో మాట్లా డారు. వరి పంటలో తడి పొడి విధానం, నీటి గొట్టం ఉపయోగించే పద్ధతి, పాటించాల్సిన మెలకువలు, నీటి పొదుపు, నీటి వినియోగం, తెగుళ్ల నివారణ, దోమపోటు నివారణ, మిథేన్ వాయువు తగ్గింపు, వేర్లకు ఆక్సిజన్ అందడం, దృఢమైన వేరు వ్యవస్థ, అధిక పిలకలు రావడంపై వివరించారు.

అనంతరం ఏడిఏ అపర్ణ మాట్లాడుతూ నీరు మనకు సహజ వనరు అని, రానున్న తరాలకు సహజ వనరులను అందించడం మన బాధ్యతని తెలిపారు. వేరు పొట్ట దశలో గింజ దశలో సమృద్ధిగా వాడాలని, ఒక కిలో బియ్యం పండించడానికి 4,000 లీటర్ల నీటిని వాడుతున్నట్టు తెలిపారు. అనంతరం వరి సాగు చేసే రైతు పొలంలో నీటి తడి పొడిని కొలవడానికి ఉపయోగించే 30 సెంటీమీటర్ల వ్యాసం గల రంధ్రాల గొట్టాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్, బస్వాపూర్ సొసైటి చైర్మన్ లింగాల కిష్టా గౌడ్, పద్మపాని స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాధా, ఏఈఓ ఆనంద్, రవి, ఉప సర్పంచ్ సిద్ధా గౌడ్, రైతుబంధు సమన్వయ కమిటీ అధ్యక్షులు రాజా గౌడ్, పద్మ పాణి స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ అమృత రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంట వివరాల నమోదు

రామారెడ్డి : మండలంలోని ఇస్సన్నపల్లి వ్యవసాయ క్షేత్రంలో బుధవారం గ్రామ వ్యవసాయ అధికారి రాకేష్ పంట వివరాలను ఆన్‌లైన్ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా పంట పెరుగుదల, సంరక్షణ, ముందు జాగ్రత్త చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో యువ రైతు మృతి

నవతెలంగాణ-పిట్లం

ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌తో యువ రైతు మృతిచెందిన ఘటన మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ లింబాద్రి కథనం మేరకు మండలంలోని చిన్న కొడప్ గల్ గ్రామానికి చెందిన పాటిల్ నర్సింగ్‌రావ్ (26) గ్రామ శివారులోని తన చేనులో కంది పంట రెమ్మలు కోస్తుండగా కంది రెమ్మలతోపాటు కరెంటు మోటార్ సర్వీస్ వైరుకు ప్రమాదవశాత్తు కొడవలి తాకడంతో కరెంట్‌షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతుడి తండ్రి పాటిల్ వామన రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. మృతుడికి ఏడాదిన్నర క్రితం పెండ్లి కాగా 4 నెలల కుమారుడు ఉన్నాడు. చేతికొచ్చిన కొడుకు, భర్త మృతిచెందడంతో తల్లిదండ్రుల, భార్య రోదనలు అక్కడున్నవారిని కలిచివేశాయి.

పరిశోధన కేంద్రంగా మారుస్తాం

- సౌత్ క్యాంపస్‌లో డిజిటల్ తరగతి గదులను ప్రారంభించిన టీయూ వీసీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న సౌత్ క్యాంపస్ లో బుధవారం సోషల్ వర్క్ విభాగంలో నూతన డిజిటల్ తరగతులు గదులను, కంప్యూటర్ ల్యాబ్‌లను యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య రవీంద్ర గుప్త ప్రారంభించారు. ఇండక్షన్ ప్రోగ్రాం అస్ సోషల్ వర్క్ ఎడ్యుకేషనల్ అండ్ ఇట్స్ పర్స్పెక్టివ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ యూజిసి సూచనలతో ప్రస్తుతం డిజిటల్ తరగతులు నిర్వహణ జరుగుతున్న నేపథ్యంలో దక్షిణ ప్రాంగణంలో అన్ని విభాగాలను అభివృద్ధి చేసుకుంటూ విద్యార్థుల పరిశోధనలకు, వారికి కావలసిన సౌకర్యాలకు పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

అలాగే ప్రత్యేక అతిధులుగా విచ్చేసిన ఉన్నత్ భారత్ అభియాన్ మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ అధికారి, కేంద్ర ఉన్నత విద్యాశాఖ అధికారి శరత్ చంద్ర నవీన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నేర్పరితనం, న్యాయకత్వం మంచి పరిణా మాల వైపు పరిగెత్తిస్తాయని, ఎంత ఎక్కువ నేర్చుకుంటే అంత జ్ఞానం మెరుగు పడు తుందని తెలిపారు. అనంతరం విద్యార్థుల కు ఫీల్డ్ వర్క్ ప్రాముఖ్యతను వివరిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్య యొక్క గొప్పతనాన్ని ఏ విధంగా చేరవేయాలో, వారితో కలివిడితో ఉండటా నికి మేలుకొని నేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య విభాగాధిపతి డాక్టర్ వీరభద్రం, అధ్యాపకులు డాక్టర్ అంజయ్య, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ జమీల్, డాక్టర్ యాలాద్రి, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


టీయూ వీసీకి సన్మానం

బడి పనులకు మోక్షం

- నవతెలంగాణ కథనంతో పనులు ప్రారంభం


నవతెలంగాణలో ప్రచురితమైన కథనంతో పనులు ప్రారంభించిన అధికారులు

'బడి' పనులకు మోక్షం ఎన్నడో



నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ఎంపికయిన పనులు ప్రారంభం కాకపోవడంపై మంగళవారం నవతెలంగాణ దినపత్రికలో "బడి పనులకు మోక్షమెన్నడో" అంటు వార్త కథనం ప్రచురితమయింది. ఈ వార్త కథనానికి స్పందించిన మున్సిపల్ ఏఈ శ్రీనివాస్ మన ఊరు- మనబడి పనులను బుధవారం పాఠశాలలో ప్రారంభించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి జేసీబీతో పనులు ప్రారంభించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్ల పనులు, డైనింగ్ హాల్ పనులను ప్రారంభిస్తున్నామని వాటిని త్వరలో పూర్తి చేస్తామని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. అలాగే పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.

సీపీఐలో పలువురి చేరిక

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్


సీపీఐలో పలువురు చేరినట్టు పార్టీ జిల్లా కార్యదర్శి దశరత్ తెలిపారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి నిత్యవసర వస్తువుల ధరలు పెట్రోల్ డీజిల్ ధరలను వంటగ్యాస్ ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డీ విరుస్తోందని మండిపడ్డారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ ఉన్న ఉద్యోగాలను కొల్లగొడుతోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి బాలరాజ్, నాయకులు దేవయ్య, హైదర్ షేక్ మాలిక్‌తో పాటు చేరినవారు మౌలానా, రాజు, హుస్సేన్, జమాల్, జమత్, రాజేశ్వర్, లింగం, హైదర్, షేక్ మాలి, షేక్ అలీ, బహదూర్ షరీఫ్, షాకీర్ పదిమంది యువకులు చేరారు.

ఆకతాయిలపై ప్రత్యేక నిఘా

- సీసీ కెమెరాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని ప్రతి గ్రామంలో నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తూ శాంతిభ ద్రతలను కాపాడుతు న్నామని, ఆకతాయిలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, పోలీసు పకృతి వనాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని అన్నారు. మండల కేంద్రంలో సిసికెమెరాలను ఏర్పాటు చేసేందుకు సహకరించిన మండల వాసలుకు ప్రతేక అభినందనలు తెలియజేశారు. పోలీసు ప్రకృతివనంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సిఐ క్రిష్ణ, ఎస్ఐ విజయ్ కొండ, ఏఐస్ఐ రాములు, ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ

ప్రతి ఆడపిల్ల సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రతి ఆడపిల్ల సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవాలని ఉమెన్స్ సెల్ఫీ డిఫెన్స్ ప్రెసిడెంట్ కరాటే ప్రియాంక తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెల్ఫ్ డిఫెన్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మధ్యకాలంలో ఆడవారిపై రోజురోజుకు అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ఆడపిల్లలు ఎవరి పై తమను తాము రక్షించుకునేందుకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ స్వాతి, ట్రెజరర్ సుప్రియ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్థంభాన్ని ఢీకొన్న బైక్..

● ఒకరు మృతి.. మరో ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-మాక్లూర్

విద్యుత్ స్థంభాన్ని బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని చిక్లీ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆకుల పోశెట్టి (55), గంగన్న, సాదు అనే ముగ్గురు కొత్తపల్లి నుంచి బైక్‌పై జన్నేపల్లి క్రాసింగ్ వైపు వెళ్తుండగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టడంతో విద్యుత్ స్థంభం విరిగిపోయి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పోశెట్టి మృతిచెందాడు. గంగన్న, సాదు అనే వ్యక్తులు తీవ్ర గాయాలవడంతో చికిత్స పొందుతున్నారు.

సెలవులు మంజూరు చేయొద్దనే ఉత్తర్వులు అప్రజాస్వామ్యం

● స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకులు డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయొద్దని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి దేవసేన ఉత్తర్వులు ఇవ్వడం అప్రజాస్వామ్యమని, అది నియంతృత్వ పోకడకు నిదర్శనమని, ఈ ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం సెలవులు ఉపయోగించుకుంటారని, వారికి, వారి మీద ఆధారపడి ఉన్నవారికి సమస్యలు వచ్చినపుడు సెలవులు ఖచ్చితంగా ఉపయోగించుకుంటారని పేర్కొన్నారు. అంతేకాని సెలవులు ఇవ్వవద్దు అనడం ఏ మాత్రం సమంజసం కాదని, కావున ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో

యువత పాత్ర కీలకం..

● వైస్ ఛాన్సలర్ రవీందర్ ● జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల అవగాహన ర్యాలీలు



మాక్లూర్ : 'ఓటర్ డే 2023' ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

డిచ్‌పల్లి : ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో యువత పాత్ర కీలకమని టీయూ వైస్ ఛాన్సలర్ రవీందర్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలను తెలంగాణ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ భవనంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2,3,4 ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ గుప్తా హాజరై మాట్లాడుతూ ఓటు అమూల్య మైనదని, రాబోవు ఎన్నికలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో యువత పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ ఆలోచన శక్తి ఉపయోగించి సరైన అభ్యర్థిని ఎన్నుకొనే అవకాశం విద్యార్థుల చేతుల్లోనే ఉందని వీసీ అన్నారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటు హక్కు అనేది చాలా కీలకమైనదని, ఓటర్ కార్డు పొందిన ప్రతి ఒక్క పౌరుడు ఎన్నికలలో ఓటు హక్కు ఉపయోగించుకొని రాజ్యాంగ విలువలు కాపాడాలన్నారు. అర్హులైన ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన పండగ రోజని పేర్కొన్నారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యత తెలుపుతూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి యువత ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మహేందర్, డాక్టర్ స్వప్న, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ, తదితరులు



రెంజల్ : చిత్రలేఖనం పోటీలు

అలాగే డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ గోపి బాబు, ఎంపీఓ కిషన్ రావు, జూనియర్ కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : తెలంగాణ గిరిజన గురుకుల మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు అధ్యాపకులు ర్యాలీ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సైదా జైనాబ్ తెలియజేశారు.

మందర్న పాఠశాలలో ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ..

బోధన్ : సాలూర మండలంలోని మంధర్న ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగ ఉపాధ్యాయులు విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహించారు. పజాస్వామ్యంలో ఓటు యొక్క ప్రాముఖ్యత, ప్రజాప్రతినిధులను ఎన్నుకునే విధానంపై హెచ్ఎం సురేఖ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మెన్ జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు..

రెంజల్ : మండలంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని వేసిన చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్టు వివరించారు. విద్యార్థులు గీసిన చిత్రాలను ప్రదర్శించారు.

ముప్కాల్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా మండలంలోని కేజీబీవీ, రెంజర్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యార్థులతో ఓటర్ ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలోని దాస్‌నగర్ సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు 'ఓటర్ డే 2023' ఆకారంలో కూర్చున్నారు.

ఆర్మూర్ : పట్టణంలో అన్ని శాఖల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజనులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ తదితరులు పాల్గొన్నారు.

భీంగల్ : తహసీల్దార్ శ్రీధర్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి విద్యార్థులతో కలిసి పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థులు



ఎన్నికల అధికారుల్లా వ్యవహరించిన విద్యార్థులు

మాక్ పోలింగ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యాలయంలో విద్యార్థినులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ఈ మాక్ పోలింగ్ నిర్వహించినట్లు విద్యాలయం ప్రత్యేక అధికారి గంగామణి తెలిపారు. ఈ మాక్ పోలింగ్ కార్యక్రమం ద్వారా పాఠశాల లీడర్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. ఇద్దరు విద్యార్థునులు నామినేషన్‌లు వేసి ఎన్నికల బరిలో నిలవగా విద్యార్థులు క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకోగా, కౌంటింగ్ నిర్వహించి పాఠశాల లీడర్‌ను ఎన్నుకున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక ఉపాధ్యాయిని బి.దిప, అర్చన, రాణి, సునిత, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తాటిపల్లి గ్రామంలో నాటుసారాను తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఆబ్కారీ అధికారులు బుధవారం దాడులు చేశారు. మాలావత్ దేశాయి, భుక్య దేవ్, భుక్య జయ నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నారని, వారిని పట్టుకున్నట్టు, వారి వద్ద నుంచి సుమారు 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు ఆబ్కారీ ఎస్ఐ నర్సింలు తెలిపారు. ఎవరైనా నాటుసారా అమ్మినా, తయారు చేసినా వారిపైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వడ్డెరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● కలెక్టర్ సి.నారాయణరెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వడ్డెరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం 2023 క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. వడ్డెర వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఆ పథకాలను వడ్డెర సంఘం ద్వారా ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు, జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యారాంగుల కృష్ణ, ఉపాధ్యక్షులు బండారి ఎల్లయ్య, చిన్న వడ్డెన్న, సహాయ కార్యదర్శి బొంతల లక్ష్మన్, గుంజ పాపన్న, సాయిలు, ఎల్లయ్య, భీమయ్య, నర్సయ్య, గంగారాం, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

పండితుల, పీఈటీ పోస్టులు వెంటనే అప్ గ్రేడ్ చేయాలి

● ఆర్‌యూపీపీ మండల అధ్యక్షులు ప్రవీణ్ శర్మ



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఏర్గట్ల

పండితులు, పీఈటీ పోస్టులను వెంటనే అప్ గ్రేడ్ చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ పండిత పరిషత్ మండలాధ్యక్షుడు ప్రవీణ్ శర్మ అన్నారు. బుధవారం నల్ల బ్యాడ్జీలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడపాకల్‌లో పండితులకు, పీఈటీలకు మద్దతుగా ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ భాషా పండితులు, పీఈటీ పోస్టులను ఉన్నతీకరణ (అప్ గ్రేడ్) చేస్తానని మాట ఇచ్చి సంవత్సరాలు గడిచినా స్పందించకపోవడం చాలా బాధాకరమైన విషయమని, ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ, సమాన పనికి సమాన వేతనం లేకుండా చాలా సంవత్సరాల నుంచి ప్రమోషన్స్ లేకుండా పండితులు, పీఈటీలు చాలా నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పుడు ప్రకటించిన ప్రమోషన్ల కన్నా ముందే భాషా పండితులు, పీఈటీ పోస్టులను తొందరగా ఉన్నతీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ పండిత పరిషత్ మండల అధ్యక్షులు ప్రవీణ్ శర్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'సౌండ్ సిస్టం' బహుకరణ



సౌండ్‌సిస్టమ్‌ను బహుకరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ముప్కాల్

1998-99 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే సంకల్పంతో తనవంతు సహాయంగా పాఠశాలకు అవసరమైన అహుజా కంపెనీ 'సౌండ్ సిస్టం'ను సుమారు రూ.20 వేల రూపాయల విలువగల పరికరాలను పాఠశాలకు బహుకరించారు. రానున్న రోజుల్లో సైతం పాఠశాలకు తమవంతు సేవలను కొనసాగిస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేందర్, పూర్వ విద్యార్థులు దత్తాద్రి, బి.వాణి, భాగ్యలక్ష్మి, నవీన్, వాణి, రాజేశ్వర్, ఉపాధ్యాయ బృందం ఓ.శ్రీనివాస్, మధుసూదన్, ప్రసాద్, పీడీ భగవాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి బీడీ కార్మికురాలికి రూ.2016 జీవనభృతిని ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఇందల్‌వాయి ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి బీడీ కార్మికురాలికి వెయ్యి రూపాయలు జీవనభృతి ఇస్తానని హామీఇచ్చి మర్చిపోయాడని అన్నారు. దీనిపై పెద్దఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఏరియా కార్యదర్శి కిషన్, రమేష్, జిల్లా నాయకులు మురళి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సాయగౌడ్, వాసరి మోహన్, పెద్దన్న, లక్ష్మి, జమున, సరస్వతి, గంగామణి, సుజాత, స్వప్న బీడీ కార్మికులు పాల్గొన్నారు.

పోస్టల్‌లో భారీగా పెరిగిన వడ్డీ రేట్లు

● ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

● పోస్టల్ నిజామాబాద్ సౌత్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తపాల శాఖలోని అన్ని పోస్టల్ పథకాలకు వడ్డీ రేట్లు భారీగా పెరిగాయని పోస్టల్ శాఖ నిజామాబాద్ సౌత్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని పొదుపు పథకాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి పోస్ట్ ఆఫీస్ వడ్డీరేట్లు సవరిస్తూ ఉంటుందని, ఇందులో భాగంగా జనవరి 1, 2023 నుంచి పోస్టాఫీస్ వడ్డీ రేట్లు భారీగా పెంచిందని, వాటికి సంబంధించిన వివిధ స్కీముల వడ్డీ రేట్ల వివరాలను వెల్లడించారు. సేవింగ్స్ అకౌంట్ 4 శాతం, రికరింగ్ డిపాజిట్ అకౌంట్ 5.8 శాతం, టైం డిపాజిట్ అకౌంట్ సంవత్సరానికి 6.6శాతం, 2 సంవత్సరాలకు 6.8శాతం, 3 సంవత్సరాలకు 6.9శాతం, 5 సంవత్సరాలకు 7శాతం, మంత్లీ ఇన్కమ్ స్కీం అకౌంట్లో 7.1 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌కు 7 శాతం, కిసాన్ వికాస్ పత్రం 7.2 శాతం, సీనియర్ సిటిజన్ అకౌంట్‌కు 8శాతం, సుకన్య సమృద్ధి అకౌంట్‌కు 7.6శాతం, పీపీఎఫ్ అకౌంట్‌కు 7.1శాతం వడ్డీ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని అమలు చేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టాలను అమలు చేయాలని, రాష్ట్రంలో మిగులు భూములన్నీ వ్యవసాయ కార్మికులకు పంచి జీవన ఉపాధి కల్పించాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు వ్యవసాయంలో అధిక యాంత్రీకరణ మూలంగా దేశ వ్యాప్తంగా సుమారు 16 కోట్ల మంది, తెలంగాణ రాష్ట్రంలో 60 లక్షలకుపైగా వ్యవసాయ కూలీలుగా ఉన్న ఉపాధి లేక గ్రామాల్లో విలవిలాడుతున్నారన్నారు. కనీసం జీవనం కొనసాగించడానికి కూడా ఇబ్బందులతో బతుకుతున్న వ్యవసాయ కార్మికులను ఆదుకొని ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన చట్టాలను, హక్కులను ఏ ఒక్కటి అమలు కానీ బడుగు జీవులు వ్యవసాయ కార్మికులేనని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాలుగా వీరి బతుకు మరి అంధకారంలో మారినందున తప్పనిసరిగా ప్రభుత్వమే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతి శ్రీనివాస కార్మిక సంఘం మండల నాయకులు అశోక్, బాలయ్య, బాలకిషన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆర్టీసీ చైర్మన్ భూమిపూజ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామానికి యానం నుంచి తొర్లికొండ మీదుగా జాన్కంపేట వరకు మంజూరైన డబుల్‌రోడ్డు పనులకు ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ వీజీగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు, జిల్లా ఆర్థిక ప్రణాళికల సంఘం సభ్యులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఐసీడీఎస్ చైర్మన్, ఎంపీపీ విమల రాజు, స్థానిక జడ్పీటీసీ తనూజ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఆర్టీసీ చైర్మెన్

అంధత్వ రహిత సమాజమే లక్ష్యం

● మేయర్ దండు నీతూ కిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంధత్వ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ అన్నారు. బుధవారం నగరంలోని 19వ డివిజన్ గంగస్థాన్‌లోని కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలందరి జీవితాలలో వెలుగులు చూడాలని ఎంతో మంది ప్రజలు కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నా ఆసుపత్రుల వైపు చూడటం చాలా తక్కువని.. ఇతర వ్యాధితో పోల్చుకుంటే కంటి సమస్యను పెద్దగా పట్టించుకోరని గ్రహించి రాష్ట్రంలోని 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించటం చాలా శుభపరిణామమని అన్నారు. నగరంలో మొత్తం 13 సెంటర్లలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కేంద్రంలో కంటి పరీక్షలకై వచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలను కల్పిస్తుందని ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ సేవలను పొందాలని విజ్ఞప్తి చేశారు. అలాగే డీఎంఅండ్‌హెచ్ఓ సుదర్శన్ పర్యవేక్షణలో మేయర్ కంటి పరీక్షలు చేయించుకున్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న మేయర్

భూమిపూజ..

నగరంలోని 34వ డివిజన్ కుమార్ గల్లీలో 20లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు, సీసీ డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ కల్పన మల్లేష్‌తో కలిసి మేయర్ భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త సహకారంతో నగరంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలు మెరుగైన సదుపాయాలను అందించటానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

ఆలోచించండి.. ప్రభుత్వాన్ని నిలదీయండి

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు నాయకత్వంలో విచ్చలవిడిగా పెంచుతున్న విద్యుత్ చార్జీల వల్ల సామాన్య ప్రజలపై తీవ్రమైన భారం పడుతుందని ప్రజలందరూ ఆలోచించి.. ప్రభుత్వాన్ని నిలదీయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షులు కేశవేణు కలిసి బహిరంగ లేఖ రాసినట్టు తెలిపారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒకపక్క ఎనిమిది సంవత్సరాలుగా 10 కంటే ఎక్కువ సార్లు చార్జీలు పెంచిన ఈ ప్రభుత్వం చార్జీలతో పాటు టారీఫ్ రేట్లు మార్చడం, యూనిట్ల స్లాబ్‌లు మార్చడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ప్రజలపై గత సంవత్సరం లోడ్ డిపాజిట్ పేరుతో (ఎక్కువ కరెంటు వాడుతున్నందుకు) ఒక్కో సర్వీస్ మీటర్‌పై 2000 నుంచి 5000 వరకు లోడ్ డిపాజిట్ ప్రభుత్వం రాబట్టడం జరిగిం దని అన్నారు.

అది సరిపోదు అన్నట్టు మళ్ళీ ప్రభుత్వం ఈ సంవత్సరం ఏసీడీ డిపాజిట్ల పేరుతో రెండు నెలల కరెంటు బిల్లును అడ్వాన్స్ డిపాజిట్ చేయమని కరెంటు వినియోగదారులపై మరొకసారి ఆర్థిక భారాన్ని మోపడానికి సిద్ధమైందన్నారు. ఏసీడీ అడ్వాన్స్ అనేది జీవితంలో మనకు మళ్ళీ తిరిగి రాని అడ్వాన్స్ కట్టడ మని.. కావున ప్రజలు ఎవరూ దీనిని చెల్లించవద్దని, నిజామాబాద్ నగరంలోని వామపక్షాల నాయకులు, కుల సంఘాల పెద్దలు, అలాగే చాంబర్ ఆఫ్ కామర్స్ అందరం కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని కేశవేణు అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ జావిద్ అక్రమ్, నిజామాబాద్ అర్బన్ బ్లాక్ ఎ అధ్యక్షులు కేశ మహేష్, కేశ రాజు పాల్గొన్నారు.



బహిరంగ లేఖ చూపుతున్న నాయకులు

మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగరాజు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎడ్ల నాగరాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ అధ్యక్షులు డేవిడ్ రాజ్, రాష్ట్ర అధ్యక్షులు తలమల హసన్, జాతీయ ఉపాధ్యక్షులు టి.దయానంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, జిల్లా కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు బాధ్యతాయుతమైన పదవిని కట్టబెట్టినందుకు సంఘానికి ముందుండి బాధ్యతాయుతంగా, సక్రమంగా పనులు నెరవేరుస్తానని అన్నారు.

రాయితీ రుణం చెక్కు అందజేత

నవతెలంగాణ-భీంగల్

2021-22 సంవత్సరంలో వికలాంగులు చేసుకున్న దరఖాస్తులలో భాగంగా చేంగల్ గ్రామానికి చెందిన దాస సాయన్నకు రూ.50వేల చెక్కును ఎంపీపీ ఆర్మూర్ మహేష్, డీఎల్‌పీఓ శ్రీనివాస్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో గంగమోహన్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మోయిజ్, సీనియర్ అసిస్టెంట్ ప్రిన్స్ తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఎంపీఓగా పదోన్నతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఎంపీఓకు సన్మానం

ఇందల్‌వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వినోద్‌కు ఎంపీఓగా పదోన్నతి పొందినట్టు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అరటి రఘు తెలిపారు. ఎంపీఓగా పదోన్నతి రావడంతో నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు కలిసి గ్రామంలోని ఆలయం వద్ద బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ నరేష్, సీనియర్ నాయకులు అరటి రఘు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భూమయ్య, కిష్టయ్య శ్రీధర్, ఎర్రన్న, ఆశన్న, కుమ్మరి గంగాధర్, సంకటి సాయిలు, కారోబార్ రజాగౌడ్, మల్లయ్య, రెడ్డెం రాజయ్య, అంబర్ సింగ్, గంగాధర్, వాటర్ మెన్ ఫయ్యస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కన్నాపూర్‌లో డ్రయినేజీ పనులను ఎంపీపీ నా రెడ్డి దశరథ రెడ్డి స్థానిక ప్రజాప్రతి నిధులతో కలిసి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి, గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేసిందని అన్నారు. ఎమ్మెల్యే సురేందర్ సహకారంతో సి డి ఎఫ్ నిధుల నుండి రూ, 10 లక్షలతో డ్రైనేజీ పనులను చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీంద్రరావు, స్థానిక సర్పంచ్ రాజా నర్సు, ఉప సర్పంచ్ అంజిల్ రెడ్డి, మండల రైతు బంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, బి ఆర్ఎస్ మండల అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటర్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ ప్రాంగణంలో బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సహకారంతో జెడ్పిటిసి తాటిపాముల పద్మ నాగభూషణం గౌడ్ , సర్పంచ్ తునికి వేణు, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్ రెడ్డితో కలిసి బోరు మోటర్ తవ్వకం ప్రారంభించారు. నీటి సమస్యను తీర్చేందుకు జడ్పిటిసి నిధులు కేటాయించిన గంపగోవర్ధన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ భగవంతు రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, రామేశ్వర్ పల్లి సొసైటీ చైర్మన్ భూమి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం


బహుమతి అందుకుంటున్న విద్యార్థి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులను జాతీయ రహదారి అథారిటీ అధికారులు బుధవారం సన్మానించారు. మండలం కేంద్రం సమీపంలో ఉన్న టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పదవ తరగతికు చెందిన విద్యార్థులు ప్రేమ సింగ్,సంతోష్ రెడ్డి,లను నగదు బహుమతి మెమోంటోలతో సన్మానించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కుబ్యా ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో శంకరం పేట నుండి మద్నూర్ వరకు 98 కి.మీ పరిధిలో జాతీయ రహదారికు అనుకోని ఉన్న ఉన్నత పాఠశాల లో ఉత్తమ ఫలితాలు సాధించిన 47 మంది విద్యార్థులకు బహుమతులు అందజేసి సన్మానించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ రహదారి సంస్థ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకాంత్, ఉపాధ్యాయులు కిషన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్‌లకు సన్మానం



నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో సన్మానించారు. లింగంపేట్ మండలం ఒంటరిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒంటరి సిద్ధారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు. ఆయనతో పాటు డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి పోల్కంపేట్ పతియోద్దీన్ లింగంపేట్ దేశ నాయక్ బోనాలతండా డైరెక్టర్ గా ప్రమాణస్వీకారం చేశారు. వారికి మండల కమిటీ తరఫున ఘనంగా సన్మానించారు. వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి మాట్లాడుతూ రైతుల ఎదుర్కొంటున్నటువంటి ప్రధాన సమస్య పరిష్కరించే దిశగా మార్కెట్ కమిటీ తోటి సభ్యులు రైతులకు అందుబాటులో ఉంటామని రైతుల పక్షాన నిలబడతామన్నారు. రైతులకు అండగా ఉండేందుకే మార్కెట్ కమిటీలు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. రైతుల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, సాధ్యమైనంతవరకు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నిస నయీం, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రమేష్, సర్పంచులు లక్ష్మీనారాయణ, సక్రు సాయ, గౌడ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు.. ప్రజాస్వామ్య ఊపిరి

నవతెలంగాణ-విలేకరుల బృందం


జుక్కల్ జడ్పీహెచ్ఎస్‌లో ప్రతిజ్ఞ

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ఊపిరి వంటిదని అర్హులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పలువురు సూచించారు. 13వ జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలీలు నిర్వహించి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు.

జుక్కల్ : జుక్కల్ జడ్పిహెచ్ఎస్‌లో హెచ్ఎం బస్వంత్ రావ్ పటేల్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించగా.. జుక్కల్ తహసిల్దార్ గణేష్, ఆర్ఐ రామ్ పటేల్ పాల్గొన్నారు. అంతకుముందు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఉపిరి లాంటిదని, అర్హులైన వారు నేడే ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో మనమందరం బాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

జుక్కల్ తహసీల్దార్ కార్యలయంలో ఎమ్మార్వో గణేష్ అధ్యక్షతన డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి, అర్ఐ రామ్ పటేల్, సిబ్బందితో కలిసి జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకోని ప్రత్తి నిర్వహించారు.

సదాశివనగర్ : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మర్కల్ స్టేజి వద్ద గల సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర లేఖనం, వ్యాసరచన, నినాదాల రచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో ఎంపిపి గైని అనుసూయ, జడ్పీటీసీ కమిలి నర్సింలు, సి.ఐ రామన్, తహసీల్దార్ ధన్‌పాల్, టిఆర్‌యస్ మండల అధ్యక్షుడు బొలిపెల్లి మహేంధర్ రెడ్డి పాల్గొన్నారు.

దోమకొండ : సమాజంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరులు ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ఎంపిపి కానుగాంటీ శారద నాగరాజు , జడ్పీటిసి తీగల తిర్మల్ గౌడ్ కోరారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చిన్నారెడ్డి జాతీయ ఓటర్ల దినత్సవ ప్రతిజ్ఞ చేయించారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుండి అంబేద్కర్, చౌరస్తా గాంధీచౌక్ మీదుగా ఆర్డీవో శ్రీను నాయక్ ఆధ్వర్యంలో అధికారులు, యువకులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో శ్రీను నాయక్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పట్టణ కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద అధికారులతో జాతీయ ఓటరు దినోత్సవ ప్రమాణం చేయించారు. వయో వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి మాధవి, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, తహశీల్దార్ సుధాకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తదితులున్నారు.


ఎల్లారెడ్డిలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, యువత, అధికారులు

ఎలక్షన్ డే.. హాలిడే కాదు

- ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకం
- విద్యావంతులుండే పట్టణాలు, నగరాల్లో ఓటింగ్ శాతం ఆందోళనకరం
- ఓటింగ్‌లో పాల్గొని భవితను నిర్దేశించుకోవాలి
- ఓటరు దినోత్సవంలో కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డిటౌన్

నా ఒక్క ఓటుతో ఏమవుతుందిలే అనే భావన ఎంతమాత్రం సరికాదని, ప్రజాస్వామ్య పరిరక్షణలో, మంచి పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటూ ఎంతో కీలకమైనదని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. అప్పుడే ప్రజాస్వామ్యం మరింత గొప్పగా పరిఢవిల్లుతుందని, అద్భుత ఫలితాలు వస్తాయని తెలిపారు. ఎలక్షన్ డే అంటే హాలిడే కాదని, మన భవితను నిర్దేశించుకునే అతి కీలకమైన రోజుగా గుర్తించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో సగటున 67 శాతం మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని, విద్యావంతులు ఎక్కువగా ఉండే పట్టణాలు, నగరాల్లో ఓటింగ్ శాతం మరింత తక్కువగా నమోదవుతుండటం దురదృష్టకరమని అన్నారు. మనల్ని పాలించే వారిని మనం ఎన్నుకునే బాధ్యతను విస్మరించడం ఎంతవరకు సమంజసమో ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలన్నారు. 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా, పోలీస్ కమిషనర్ కే.ఆర్.నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ సందేశం అనంతరం జిల్లా పాలనాధికారి ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ప్రసాదించబడిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తోందని గుర్తు చేశారు. సుమారు 94 కోట్ల 50 లక్షల పై చిలుకు ఓటర్లు కలిగిన భారతదేశ ఎన్నికల వ్యవస్థ ప్రపంచంలోనే అతి పెద్దదని అన్నారు. అయినప్పటికీ ఓటు హక్కు ఎంతో పారదర్శకంగా, సాఫీగా మనల్ని పరిపాలించే నాయకులను మనం ఎన్నుకోగల్గుతున్నామని, ఈ దిశగా ఎన్నికల సంఘం ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా పకడ్బందీగా ఎన్నికలు జరిపిస్తుండడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఇదివరకు ప్రతి ఏడాది జనవరి 01 న కొత్త ఓటర్ల పేర్లను జాబితాలో నమోదు చేసేవారని, ప్రస్తుతం ఏడాదిలో నాలుగు పర్యాయాలు నమోదు చేసుకునే వెసులు బాటును కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోలీస్ కమిషనర్ కే.ఆర్.నాగరాజు మాట్లాడుతూ జాతి, కుల, మత, లింగ, వర్ణ భేదాలు, బడుగు, బలహీన వర్గాలు అనే తేడా లేకుండా పద్దెనిమిదేళ్ల దాటిన పౌరులందరికీ రాజ్యాంగం ఓటు హక్కును ప్రసాదించిందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో క్రమం తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్లను, ఓటరు నమోదు ప్రక్రియ విధులను సమర్థవంతంగా నిర్వహించిన బీ.ఎల్.ఓ. లు, ఎన్నికల అధికారులను, కొత్తగా నమోదైన యువ ఓటర్లను జిల్లా యంత్రాంగం తరపున సత్కరించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, బి.చంద్రశేఖర్, నిజామాబాద్ ఆర్డీఓ రవి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు.


అత్యధికసార్లు ఓటుహక్కు వినియోగించుకున్న వృద్ధుడికి సన్మానం..


కామారెడ్డిలో యువతికి ఓటరుకార్డు అందజేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్ : ఓటు వజ్రాయుధం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించి మాట్లాడారు. 18 ఏళ్ల నిండిన యువతి, యువకులు ఓటర్ గా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సంవత్సరానికి నాలుగు సార్లు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో, అడిషనల్ ఎస్పీ అన్యోన్య, శిక్షణ కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, ఏవో రవీందర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిష్టయ్య, వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్, తెలుగు ప్రొఫెసర్ శంకర్, తాసిల్దార్ వెంకట్రావు, ఎన్నికల విభాగం అధికారులు నరేందర్, శ్రావణి, ఇంద్ర ప్రియదర్శిని పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పనులు

త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-రామారెడ్డి/తాడ్వాయి

గ్రామాల్లోని ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మనబడి లో మొదటి దశలో ఎంపికైన పాఠశాలల పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని ఈసన్నపల్లి, అన్నారం మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలు మన ఊరు మనబడి లో ఎంపిక కావడంతో, పాఠశాలలను బుధవారం పరిశీలించారు. ఇస్సన్నపల్లి పాఠశాల దూరం నుండే కనువిందు చేస్తుందని, మిగిలి ఉన్న పనులను పూర్తి చేసి, ఇతర పాఠశాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కలెక్టర్ వెంట సెక్టోరియల్ అధికారి మనోహర్, ఎమ్మార్వో ఆనంద్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంఈఓ యోసుఫ్, సర్పంచులు కందూరి బాలమణి లింబాద్రి, కూడెల్లి అమృత బాలరాజు, ప్రధానోపాధ్యాయులు బాలయ్య, ఎంపీ ఓ సవిత, ఎస్ఎంసి చైర్మన్ కీసరి రాజు, పంచాయతీ కార్యదర్శులు నరేష్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : పాఠశాలలో జరుగుతున్న మరమతు పనులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మరమతు పనులను పరిశీలించారు. ఈనెల 28 వరకు మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కావాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సర్పంచ్ భూషణం, ఎంఈఓ రామస్వామి తదితరులున్నారు.


తాడ్వాయి: కృష్ణజివాడిలో మాట్లాడుతున్న కలెక్టర్

మెగా రక్తదాన శిబిరం విజయవంతం


రక్తదానం చేస్తున్న పలువురు దాతలు

నవతెలంగాణ-లింగంపేట్

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం వాసవి క్లబ్ కామారెడ్డి, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, శ్రీ కల్కి మానవ సేవా సమితి, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం లింగంపేట్ మండలం పర్మళ్లలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైనట్లు నిర్వహకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా లింగంపేట్ ఎస్సై శంకర్ హాజరై మాట్లాడుతూ తలసేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని రక్త దాతలు ప్రాణదాతలతో సమానమని అన్నారు. రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందజేశారు. రక్తదాన శిబిరం విజయవంతానికి గత పది రోజుల నుంచి ఎంతగానో కృషి చేసిన రాజా గౌడ్, పుట్ల అనిల్ ను అభినందించారు.

కార్యక్రమంలో డాక్టర్ బాలు, విశ్వనాత్, మహేశ్‌గుప్త మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తాన్ని అందజేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని ఎవరికైనా రక్తం అవసరమైనట్లయితే 9492874006 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరువయ్య, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పతియోద్దీన్, రెడ్ క్రాస్ డివిజన్ సెక్రెటరీ జమీల్, కల్కిమానవ సేవా సమితి నిర్వాహకుడు చంద్రశేఖర్, వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి కొడిశాల శివకుమార్, అడ్లూరు ఎల్లారెడ్డి ఉప సర్పంచ్ చింతల లక్ష్మీపతి, భారతీయ కిసాన్ సంగ్ గ్రామ అధ్యక్షుడు ప్రభు రాజ్, సొసైటీ డైరెక్టర్లు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్/ఎల్లారెడ్డి/లింగంపేట్

భిక్కనూర్ మండలంలోని జంగంపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ నర్సింలు యాదవ్, డిసిసిబి డైరెక్టర్, సొసైటీ చైర్మన్ సిద్ధ రాములు, ఎంపీటీసీ యశోద కృష్ణయ్యతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దృష్టిలోపం దూరం చేసే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని, గ్రామస్తులందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు పరిశీలించి, కంటి వైద్య పరీక్షలు చేయించుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భాస్కర్, ఎంపీ ఓ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బాబు, టీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


భిక్కనూర్ మండలం జంగంపల్లిలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూ గ్రామం లో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపిపి మాధవి ప్రారంభించారు. 18 ఏండ్లు నిండినవారందరూ కంటి వెలుగు పరీక్షలకు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉషగౌడ్, సర్పంచ్ దామోదర్, ఎంపిఓ ప్రకాష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : లింగంపేట మండల కేంద్రంతో పాటు మోతేలో నిర్వహించిన శిబిరాల్లో బుధవారం 245 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి హిమ బిందు తెలిపారు. లింగంపేట్‌లో 131 మందిలో 61 మందికి, మోతే గ్రామంలో 114 మందిలో 48 మందికి కంటి అద్దాలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య అధికారులు సంగీత, అమల, యాదగిరి, రమేష్, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

ఎడ్లకట్ట వాగు చెక్ డ్యాంకు భూమిపూజ


పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో ఎడ్ల కట్ట వాగు వద్ద నిర్మించబోయే చెక్ డ్యాంకు బుధవారం సర్పంచ్ స్వామి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దాయారి సాయిరెడ్డితో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెక్ డ్యాం ద్వారా వర్ష కాలంలో నీటిని నిలువ చేసుకొని వేసవికాలంలో నీటిని పొదుపుగా వాడుకోవచ్చని, దీంతో బోరు బావులలో నీటి సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దుర్గారెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మంద నాగరాజు, ఉప సర్పంచ్ నర్సింలు, కమలాకర్, రాజయ్య లింగారెడ్డి, విష్ణు, మల్లేష్ రెడ్డి, శ్రీనివాస్, సత్యం, రిలయన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

టీజేఏసీ చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-లింగంపేట్

ఈ నెల 30, 31 తేదీలలో టీజేఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో ఢిల్లీ కరపత్రాలను పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి నిజ్జన రమేశ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ తొమ్మిందేండ్ల పాలనపై పార్టీ అధ్యక్షులు కోదండరామ్ నాయకత్వంలో ఢిల్లీలో కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో 'కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలన-అభివృద్ధి-వాస్తవాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. అదే విధంగా విభజన హామీలను నెరవేర్చాలని జంతర్ మంతర్ దగ్గర దీక్ష చేయనున్నట్టు తెలిపారు. కావున పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ యాదవ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు చాకలి కుమార్, బోయిని రాజు ముదిరాజ్, మూలిగే రమేష్,యాదగిరి, సాయిలు,ప్రసాద్ లు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టు అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపెట్ మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై బెల్టులు అందజేసినట్టు ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ పిల్లలు ఎంతో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. జె.ఎస్ ఎం. హాస్పిటల్-గోపాల్ పేట్, ఎంపిటిసీ బొదనపు ఇందిర శ్రీనివాస్ తరుపున ఉచితంగా అందజేసినట్టు తెలిపారు. సాయికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌రెడ్డి ఉపసర్పంచ్ సాయిలు, పాఠశాల చైర్మన్ కిషణ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నామమాత్రపు పర్మిషన్లు..

యథేచ్ఛగా మొరం తరలింపు

- మామూళ్ల మత్తులో అధికారులు?

నవతెలంగాణ-పిట్లం

నామమాత్రంగా పర్మిషన్‌లు తీసుకొని పలువురు అక్రమార్కులు యథేచ్ఛగా మొరం తరలింపు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ గుట్టలను రోజురోజుకు తవ్వి వందల సంఖ్యలో ట్రాక్టర్లతో వెంచర్‌లకు, గృహ నిర్మాణాలకు తరలిస్తూ ప్రకృతిని కొల్లగొడుతున్నారని, లక్షల్లో వెనకేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. గతంలో ఒక ట్రాక్టర్‌కు రూ.300-400 ఉండగా, ప్రస్తుతం రూ.600-700లకు పెరగడంతో సామాన్యులకు అందకుండా పోయింది. అక్రమార్కుల నుండి సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో తూగుతూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డివిజన్ అధికారులు సైతం వత్తాసు పలకడంతో రోజురోజుకీ అడ్డు అదుపు లేకుండా పోయింది. గతంలో మొరం సెలవు దినాల్లో అక్రమంగా తరలిస్తూ ఉండేవారని, ప్రస్తుతం అలా కాకుండా ఎప్పుడు పడితే అప్పుడు కండ్ల ముందు నుంచి తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి అక్రమార్కుల ఆట కట్టించి, అందుకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.


ట్రాక్టర్‌లో యథేచ్ఛగా మొరం తరలింపు

చందూర్ సొసైటీ చైర్మన్‌గా ప్యారం అశోక్

నవతెలంగాణ-వర్ని

చందూర్ గ్రామంలోని సహకార సంఘం చైర్మన్‌గా ప్యారం అశోక్ బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశానుసారం గత రెండున్నర ఏండ్లు మాధవరెడ్డి చైర్మన్‌గా కొనసాగారు. కాగా బుధవారం ఆ బాధ్యతలను జిల్లా సహకార సంఘం అధికారుల సమక్షంలో అశోక్ బాధ్యతలు చేపట్టారు. దీంతో టీఆర్‌ఎస్ బాన్సువాడ ఇన్చార్జి పోచారం సురేందర్‌రెడ్డి ఆయనకు మిఠాయిలు తినిపించి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు కర్లం సాయిరెడ్డి, సత్యనారాయణ, మండల అధ్యక్షులు అంబర్‌సింగ్, దేవిసింగ్, రవి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్ల శ్రీరాములు, రామ్‌రెడ్డి, డైరెక్టర్లు రైతులు, ప్రచార కార్యదర్శి ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణ విద్య కార్యక్రమం ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం ఆత్మ రక్షణ విద్య కార్యక్రమాన్ని మండల విద్యాధికారి ఎస్.ఆంధ్రయ్య ప్రారంభించారు. సమగ్ర శిక్ష తెలంగాణ ఆత్మ రక్షణ కార్యక్రమంలో భాగంగా 'సెల్ఫ్ డిఫెన్స్'పై కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ సురేష్ విద్యార్థినులకు పలు రకాల వ్యాయమాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థినులతో కరాటే విన్యాసలు చేయించారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేక అధికారిణి గంగామణి, పాఠశాల ఉపాధ్యాయినిలు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయండి

- **జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. బుధవారం నగరంలోని నాందేవ్‌వాడలో రైతు సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా గెలుపులో భాగంగా గురువారం నిజామాబాద్ జిల్లాలో ట్రాక్టర్ ర్యాలీ ఐటీఐ గ్రౌండ్ నుంచి ప్రారంభించి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగుతుందని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతు విమోచన చట్టం తీసుకురావాలని, మద్దతు ధర చట్టం చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్తు సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు మీటర్లు పెట్టే పద్ధతిని మానుకోవాలని లకింపూర్ కేర్ ఘటనకు సంబంధించిన మంత్రి కొడుకునిపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ట్రాక్టర్ ర్యాలీ జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెద్ది వెంకట్‌రాములు, ఏశాల గంగాధర్, శంకర్, కళా, శశికళ, లక్ష్మణ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని మార్కెటింగ్ కమిటీ వ్యవసాయ గిడ్డంగి నుంచి ప్రధాన రోడ్డు వరకు సీసీ రోడ్డు పనులను మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, జెడ్పీటీసీ మేక విజయ సంతోష్‌లు ప్రారంభించారు. మార్కెటింగ్ కమిటీ ప్రత్యేక నిధుల నుంచి 30 లక్షల రూపాయలు కేటాయించగా ఆ నిధులతో పనులు ప్రారంభించినట్టు తెలిపారు. కాంట్రాక్టర్ నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, గిరిజవర్ గంగారెడ్డి, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ షకీల్, మైనార్టీ సీనియర్ జిల్లా నాయకులు రఫీక్, రైతుబంధు జిల్లా డైరెక్టర్ ఎండీ మౌలానా, ఏఎంసీ డైరెక్టర్ యస్మిన్ బేగం, నీల సింగిల్విండో చైర్మన్ ఇమామ్ బేగ్, కందకుర్తి ఎంపీటీసీ అసాద్ బేగ్, రెంజల్ బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు టి.అంజయ్య టీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అనిల్, మార్కెటింగ్ కమిటీ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో చండీయాగం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలోని శుక్రవారం దేవి జాతరలో ఉత్సవాలలో భాగంగా దేవి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో బుధవారం చండీ యాగం నిర్వహించారు. అర్చకులు కృష్ణ, శ్రీనివాస్, రఘు ఆధ్వర్యంలో నిర్వహించిన చండి యాగంలో పలువురు దంపతులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు పోలీసు విద్యాసాగర్ లావణ్య దంపతులు, బక్కన్న, రమేష్, శేఖర్, వినోద్, నారాయణ, ముత్తెన్న, దేవదాస్, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనులు పరిశీలన

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలోని మోస్రా మండలంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులను బాన్సువాడ టీఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జ్ పోచారం సురేందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన వెంట రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్ల శ్రీరాములు, ఆర్‌అండ్‌బీ అధికారి తదితరులున్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకునికి ఘన సన్మానం

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన రవీందర్‌రెడ్డికి హూన్స సొసైటీలో కిసాన్‌సెల్ మండల అధ్యక్షులు, సొసైటీ చైర్మెన్ బుచ్చుల్‌వార్ రవి శాలువాతో ఆయనను బుధవారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి మీ వంతు కృషి చేయాలని సొసైటీ చైర్మెన్ బుచ్చయ్య వార్ రవి ఆయనను కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వినోద్ బాబా, మాజీ ఎంపీటీసీ శంకర్, భాజే గంగారాం, అర్జున్ పటేల్, ఎన్ఎస్‌యూఐ బోధన్ మండల అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రకాష్, గోనెవర్ లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-బోధన్

మైనారిటీ కార్పొరేషన్ స్వయం ఉపాధి రుణాలకు బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్ బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బోధన్ మండలంలో మొత్తం 340 మంది మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోవడంతో లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ మధుకర్, ఎస్.బీద, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుని జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షులు పూజ నరేందర్ ఆధ్వర్యంలో వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇంచార్జ్ ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఖాందేష్ శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఖాందేష్‌కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, సీనియర్ నాయకులు పోల సుధాకర్, పండిత్ పవన్, జనార్ధన్ గౌడ్, సుంకరి రవి, మున్సిపల్ కౌన్సిలర్లు గంగా మోహన్ చక్రు, సుంకరి రంగన్న పాల్గొన్నారు.

ప్రజల పక్షాన 'నవతెలంగాణ'

- **క్యాలెండర్ ఆవిష్కరణలో రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్**



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మెన్, ఎమ్మెల్సీ వీజీగౌడ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నవతెలంగాణ దినపత్రిక ప్రజల పక్షాన వార్తలు రాస్తూ.. నిజాలను నిగ్గు తేల్చుతుందని రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని తొర్లికొండ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన నవతెలంగాణ క్యాలెండర్‌ను సైతం ఎమ్మెల్సీ వీజీగౌడ్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ చైర్మన్ సంబారి మోహన్, జిల్లా ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యుడు బాజిరెడ్డి జగన్, ఎంపీపీ కుంచాల విమల రాజు, జెడ్పీటీసీ తనుజ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, మండల కో ఆప్షన్ నెంబర్ బులెట్ అక్బర్‌ఖాన్, సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ పద్మ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ వేములపల్లి కిరణ్‌కుమార్ వర్ధంతి సభలను నిర్వహించాలి

- **ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దేశెట్టి సాయి రెడ్డి పిలుపు**

నవతెలంగాణ-మాక్లూర్

ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ రాష్ట్ర కన్వీనర్, నిజామాబాద్ జిల్లా యువజన ఉద్యమ నాయకుడు కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ 32 వర్ధంతి సభలను జనవరి 30, 31 తేదీలలో జిల్లా వ్యాప్తంగా జరపాలని ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు దేశెట్టి సాయిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బొర్గం (కె) గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామ్రేడ్ కిరణ్ కుమార్ జిల్లాలోని యువకులను కూడగట్టి యువజన సంఘాలు స్థాపించాడని, యువత చెడు వ్యసనాలకు గురికాకుండా అలాగే ఈ జిల్లాలో సింగిల్ నెంబర్ లాటరీలను నిషేధించాలని కిరణ్ పోరాడాడని తెలిపారు. కావున నేటి యువత కామ్రేడ్ కిరణ్ చూపిన మార్గంలో పయనించినప్పుడే ఆయనకు నిజమైన నివాళులు అర్పించిన వారిని అవుతామని సాయిరెడ్డి అన్నారు.

ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థలో పలు పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బుధవారం కళాశాల ఆవరణంలో కళాశాల యాజమాన్యం మారయ్య గౌడ్ హరిత గౌడ్ కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను మెహందీ పోటీలను, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మారయ్య హరితగౌడ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలకు ముగ్గుల పోటీలను మెహందీ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థినీలు వేసిన ముగ్గులు ఎంతగానో అలరించాయి. గెలుపొందిన విద్యార్థులకు కళాశాల తరపున గురువారం బహుమతులను అందజేయనున్నట్టు వివరించారు. అనంతరం నిర్వహించిన మెహందీ పోటీలలో ప్రతిభను కనబరిచిన వారికి కళాశాల యాజమాన్యం తరపున బహుమతులను ప్రదానం చేశారు. ఈ ముగ్గులు మెహందీ పోటీలను నిర్వహించిన స్వప్న, శ్రీలేఖ కిరణ్మై శ్రీదేవి, నహియ నాయబ్, కళాశాల యాజమాన్యం తరపున అభినందించారు. కార్యక్రమంలో పీడీ లక్ష్మణ్ గౌడ్, ఇంచార్జి ప్రిన్సిపాల్ భూమయ్య, విద్యార్థినీలు అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్‌లో క్రీడా పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్‌లో రిపబ్లిక్ డే సందర్భంగా క్లబ్ సభ్యులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు క్లబ్ సెక్రటరీ గడ్కోలు సంజీవరెడ్డి తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, లాంగ్ టెన్నిస్, బిలియర్డ్స్, స్నూకర్, క్యారం, చెస్, బ్రిడ్జి గేమ్ తదితర పోటీలను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. షటిల్ బ్యాట్మెంటన్ డబుల్ గ్రూప్‌లో చిలువేరు సత్యం, అరవింద్‌ల జట్టు విన్నర్స్‌గా, అంగిరేకుల సాయిలు, రాంప్రసాద్‌ల జట్టు రన్నర్స్‌గా గెలుపొందిందని తెలిపారు. షటిల్ సింగిల్స్ విభాగంలో మహేష్ కుమార్ విన్నర్‌గా, ఉదయ్ రన్నర్‌గా నిలిచారని క్లబ్ మేనేజర్ సురేష్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రిపబ్లిక్ డే ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం క్లబ్ ఆవరణలో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేయనున్నట్టు వారు తెలిపారు.

ఓఎల్ఎంఎస్‌పై ఫర్టిలైజర్ యజమానులకు అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో పట్టణ వ్యవసాయ శాఖ కార్యాలయంలో పట్టణ ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ హాజరై మాట్లాడుతూ పురుగుమందులు దుకాణాల యజమానులతో (ఓఎల్ఎంఎస్) ఆన్లైన్ లైసెన్స్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్‌లో దుకాణ యజమానులు లైసెన్స్ పొందేందుకు ఏ విధమైన పత్రాలను పొందుపరుచాలి, ఆన్లైన్లో ఏ విధంగా సబ్మిట్ చేయాలి అనే అంశాలను వివరంగా వారికి తెలియజేశారు. ఆన్లైన్‌లో పత్రాలను పొందుపరిచే సమయంలో ఏవైనా సందేహాలు ఉన్నట్టయితే అధికారులను సంప్రదించాలని వారిద్వారా నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఏడీఏ జగదీశ్వర్, అర్బన్ మండల వ్యవసాయ అధికారి సౌమ్య, ఏఓ గోపి, 25 మంది ఫర్టిలైజర్ యజమానులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభకు ప్రోత్సాహం..

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్ : రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సహాయ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా ఎంపికైన పట్టణ తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, సీపీ నాగరాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రం, అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కాంత్‌రావు, ఆర్ఐ అశోక్‌సింగ్ పూలమాల శాలువాతో తహసీల్దారు వేణుగోపాల్ గౌడ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మజద్, జలంధర్, సబీర్, సురేష్ విక్రమ్, అరుణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం బోధన్ పట్టణంలోని ఉప విద్యాధికారి కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి డ్రాయింగ్ పోటీలలో బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)కు చెందిన 10వ తరగతి విద్యార్థి సాయితేజ డ్రాయింగ్ పోటీలలో పాల్గొని మండల స్థాయిలో ప్రథమ స్థానంలో విజేతగా నిలిచాడు. దాంతో బుధవారం నిజామాబాద్‌లోని నూతన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో విద్యార్థి సాయితేజ కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో సీపీ నాగరాజు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రమిశ్ర పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థికి పాఠశాల హెచ్ఎం రాజేశ్వర్ శర్మ, డ్రాయింగ్ ఇన్‌స్ట్రక్టర్ లింబూరి లక్ష్మణ్, ఉపాధ్యాయులు నగేష్ బాబు, సునీత్ కుమార్, ఈశ్వర్, రాచప్పా, పుష్పలత, రాజేశ్వర్, వెంకట్, శ్యామల తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

వర్ని : జాతీయ ఓటు హక్కు దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వ్యాస రచన పోటీలో చందూర్ మండల విక్టరీ స్కూల్ నేనాకు చెందిన మానస విద్యార్థినికి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, సీపీ నాగరాజు చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. విద్యార్థి వ్యాసరచన పోటీలో ఓటు హక్కును ప్రజలు ఎలా ఉపయోగించుకోవాలో, ఓటు హక్కు అనేది దేశాన్ని మార్చే ఒక గొప్ప ఆయుధమని విద్యార్థి వ్యాసరచనలో వివరించడంతో బహుమతి గెలుచుకుందని పాఠశాల బృందం తెలిపింది.

జిల్లాస్థాయి ఉపన్యాస పోటీల్లో విజేతగా విజయ్ విద్యార్థిని..

కంఠేశ్వర్ : 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలను మంగళవారం నిర్వహించగా.. 'ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్ర' అనే అంశంపై 8వ తరగతి చదివే విజయ్ విద్యార్థి బి.తనూశ్రీ పాల్గొని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకుందని కరస్పాండెంట్ ప్రభాదేవి తెలియజేశారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన తనుశ్రీని పాఠశాల కార్యదర్శి డా.అమృతలత, కరస్పాండెంట్ వి.ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ పి.విజేత అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

బహుమతి స్వీకరించిన విద్యార్థిని..

జక్రాన్‌పల్లి : జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని నిజామాబాద్‌లో నిర్వహించిన చిత్రకళ పోటీలలో జక్రాన్‌పల్లి హైస్కూల్‌కు చెందిన నవనీత పోటీలలో పాల్గొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని చిత్రకళ పోటీలో తృతీయ స్థానం సంపాదించింది. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతిని స్వీకరించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్, పాఠశాల బృందం అభినందించారు.



ఆర్మూర్ : తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, సీపీ



కంఠేశ్వర్ : బహుమతి అందజేస్తున్న దృశ్యం



జక్రాన్‌పల్లి : బహుమతి అందజేస్తున్న దృశ్యం

సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి

- **ఎండీఎం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి**

నవతెలంగాణ-నవీపేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు తహసీల్దార్ వీర్‌సింగ్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో మధ్యాహ్న భోజన కార్మికులకు 3000 రూపాయల కనీస వేతనంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏడాది కాలం గడుస్తున్నా హామీ నెరవేర్చలేదని అన్నారు. వెంటనే ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. అలాగే బకాయి బిల్లులతోపాటు చిన్న పిల్లలకు అందించే పౌష్టికాహారం కోడిగుడ్లు నేరుగా ప్రభుత్వమే అందించాలని కోరారు. కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పించాలని ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్, యూనియన్ నాయకులు మహమ్మద్ ఇబ్రహీం, గుజ్జల లక్ష్మి, చిన్నయ్య, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

అరవింద్ నోరు అదుపులో పెట్టుకో

- **ఓర్వలేకే మంత్రిపై లేనిపోని మాటలు**
- **బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు రేగుంట దేవేందర్**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఎంపీ అరవింద్ జాగ్రత్తగా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు రేగుంట దేవేందర్ హితవు పలికారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి బాల్కొండ నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక లేనిపోని పనికి మాలిన మాటలు మాట్లాడుతూ ఎంపీ అరవింద్ పబ్బం గడుపుకుంటున్నాడని అన్నారు. రైతులకు గానీ, పార్లమెంట్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా అభివృద్ధి చేస్తున్న ప్రశాంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యాలు చేయడం ఒక్క అరవింద్‌కే చెల్లుతుందన్నారు. చేసిన అభివృద్ధి లేదు, ఒక్కరికి పీఎంఆర్ఎఫ్ ఇప్పించిన పాపాన పోలేదు, ఇచ్చిన హామీని నిలబెట్టుకొని రైతులకు పసుపు బోర్డు తేకపోగా ప్రశాంత్‌రెడ్డి గురించి మాట్లాడేది నీవా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా నీతిమాలిన మాటలు మాట్లాడడం మాని మంత్రితో అభివృద్ధిలో పోటీ పడాలన్నారు. ఇష్టరీతినా మాట్లాడడం మానకపోతే ప్రజలే నీకు తగిన బుద్ది చెప్పడం ఖాయమన్నారు. నియోజవర్గానికి లక్ష ఇండ్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో కట్టిస్తాన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి, పేద ప్రజలను సీఎంఆర్ఎఫ్‌తో అదుకున్న సుమారు 10వేల మంది లబ్ధిదారులు నీకు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పసుపు తవ్వే సమయం రాగానే రైతులు పసుపు బోర్డు గురించి ఎక్కడ తిరగబడతారో అని భయంతో సమస్యను ఇష్టరీతిన మాట్లాడి పక్కదోవ పట్టించడం అరవింద్‌కు పరిపాటి అయ్యిందన్నారు. ఇదంతా రైతులు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు, రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, పిప్పెర అనిల్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, నాయకులు అజ్మత్ హుస్సెన్, హల్దే శ్రీనివాస్, కొత్తపల్లి రఘు, జంగం మహేష్, లోలపు సుమన్, నవీన్‌గౌడ్, తీగల హరీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేగుంట దేవేందర్

నేడు వాటర్ ప్లాంట్ ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

వసంత పంచమి, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మామిడిపల్లి నలంద హైస్కూల్లో విద్యార్థుల సౌకర్యార్థం వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసి ప్రారంభిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలలో ముందు ఉంచుతూ వారి ఆరోగ్య విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు వారు తెలిపారు.

వరి పంటలను పరిశీలించిన ఏడీఏ

- **రైతులకు సలహాలు సూచనలు**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్‌నగర్ గ్రామంలో వరి పంటలను భీంగల్ ఏడీఏ కాంపాటి మల్లయ్య బుధవారం పరిశీలించారు. వరి పంటలపై చీడపీడలు ఆశించినట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చర్యలను వివరించారు. వరి పంటపై కాండం తొలిచే పురుగు, అగ్గి తెగులు, బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించినట్టు తెలిపారు. కాండం తొలిచే పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు 10 కిలోలు చొప్పున లేదా కార్టాఫ్ హైడ్రో క్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోల చొప్పున ఎకరాకు వేయాలన్నారు. వాతావరణంలో రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయిలో ఉండి పగటి ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పుడు అగ్గి తెగులు వరి పంటకు సోకుతుందన్నారు. వరి ఆకులపై నూలు కండె ఆకారంలో తుప్పు మచ్చలు కనిపించిన యెడల రైతులు ట్రైసైక్లోజోల్ 100 గ్రాములు ఎకరాకు వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అగ్గి తెగులు ఆశించిన పంటకు యూరియాను వాడవద్దని తెలిపారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టినట్టయితే పెట్టుబడి ఖర్చు తగ్గి అధిక దిగుబడులను సాధించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు ప్లాంటోమైసిన్ లేదా అగ్రి మైసిన్ పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు రవి, నిఖిల్, రైతులు పాల్గొన్నారు.

